అనుదినం ప్రజాపక్షం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 04 జులై 2023

పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు

నస్పూర్ : సింగరేణి ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి సోమవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో వివిధ పోటీల్లో వారి నైపుణ్యతను చాటడం చాలా సంతోషకరమైన విషయమని, విద్యార్థులు అన్ని పోటీలలో పాల్గొని వారి నైపుణ్యతను ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పాలిటెక్నిక్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్, పర్యావరణ అధికారి హనుమాన్‌గౌడ్, సీనియర్ పిఓ పి.కాంతారావు పాల్గొన్నారు.



పోడు భూములకు పట్టాలు పంపిణీ

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని సవాతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొట్రంగి దేవ్‌రావు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సరండి సర్పంచ్ కమలాకర్, సింగిల్‌విండో చైర్మన్ పెంటు గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి తమకు పోడు భూములకు పట్టాలు లేకపోవడంతో బ్యాంకు ద్వారా రుణాలు పొందలేకపోయారని తెలిపారు. అప్పులు చేసి పంటలు సాగు చేసేవారన్నారు. జూన్ 30న సీఎం కేసీఆర్ పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేశారని, సవాతీ గ్రామ పంచాయతీ గిరిజనులకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఆగని మొరం దందా..!

- జేసీబీలతో రాత్రీ పగలు తవ్వేస్తున్న వైనం
- బొందల గడ్డగా మారుతున అసైన్డ్ భూములు
- హెచ్చరించి వదిలిపెడుతున్న అధికారులు
- షరామామూలేనని పట్టించుకోని అక్రమార్కులు
- సహజ వనరులు హరించుకుపోతున్నా దృష్టి సారించని ప్రభుత్వం

జిల్లాలో అక్రమ మొరం దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. నిబంధనలు అతిక్రమించి యథేచ్ఛగా తవ్వేస్తున్నా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. అసైన్డ్ భూములను ఇష్టారీతిన తవ్వేస్తూ బొందల గడ్డగా మారుస్తున్నా అధికార యంత్రాంగం నియంత్రించడంలో పూర్తిగా విఫలమవుతోంది. కండ్ల ముందే జేసీబీలతో తవ్వేస్తూ వందలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నా అడ్డుకోవడం లేదు. అడపాదడపా అక్కడికి వెళ్లి తవ్వకాలు ఆపేయాలని చెబుతూ చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు హెచ్చరించినా ఒకటి, రెండు రోజులు మాత్రమే తవ్వకాలు నిలిపివేస్తున్న అక్రమార్కులు ఇలాంటి పరిస్థితి షరామామూలేనని మళ్లీ మొదలు పెడుతున్నారు. ఈ అక్రమ దందా మూడు పువ్వులు..ఆరు కాయలుగా మారుతోంది. ఏండ్లుగా ఈ మట్టి దందా సాగుతున్నా అధికారులు సీరియస్‌గా దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. అసైన్డ్ భూములన్నీ పనికిరాకుండా పోతున్నా ప్రభుత్వం కూడా దృష్టి సారించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, తలమడుగు

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కజ్జర్ల శివారులో సర్వే నెం.139, 142లో వందల ఎకరాల్లో అసైన్డ్ భూమి ఉంది. గతంలో కొందరు వ్యక్తులకు వ్యవసాయం చేసుకునేందుకు ప్రభుత్వం దీన్ని అప్పగించింది. కానీ ఇందులో వ్యవసాయం చేయడం లేదు. కొందరు వ్యక్తులు ఇదే అదనుగా భావించి మొరాన్ని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రత్యేకంగా జేసీబీలు పెట్టి..టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ తతంగం అనేక ఏండ్ల సాగుతున్నా అధికారులు ఎవరూ పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదు. అడపాదడపా వెళ్లి తవ్వకాలను నిలిపివేస్తున్నారు. అధికారులు వెళ్లిపోగానే మళ్లీ షరామామూలుగా యథేచ్ఛగా చేపడుతున్నారు. వందలాది టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు మొరాన్ని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వారం రోజుల క్రితం మైనింగ్, రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి తవ్వకాలను నిలిపివేశారు. రూ.వేలాది రూపాయలు వరకు జరిమానా కూడా విధించినట్లు తెలిసింది. మరోసారి తవ్వకాలు చేపడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. కానీ ఈ మొరం దందాతో రూ.కోట్ల లాభం వస్తుండటంతో సదరు వ్యక్తులు ఈ దందాను ఆపడం లేదని తెలుస్తోంది. అధికారులు విధించే చిన్నపాటి జరిమానాను వారు ఏ మాత్రం లెక్కచేయడం లేదని తెలుస్తోంది. వీరికి కొందరు రాజకీయ నాయకులు అండగా నిలుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సహజ వనరులను కాపాడాల్సిన కొందరు అధికారులు, నాయకులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ తతంగం సాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు 'మామూలు'గా తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.



ప్రమాదకరంగా గుంతలు..!

కజ్జర్ల శివారులోని అసైన్డ్ భూమిలో ఉన్న చెట్లను తొలగిస్తూ మొరాన్ని తీసుకెళ్తున్నారు. అక్కడే జేసీబీలను పెట్టి మరీ తవ్వకాలు చేపడుతున్నారు. ఏండ్లుగా సాగుతున్న ఈ దందాతో అక్కడ పెద్ద పెద్ద గుంతలు పడి ఆ ప్రాంతమంతా ప్రమాదకరంగా మారుతోంది. మరోపక్క ప్రస్తుతం మొరం తవ్విన ప్రాంతంలో పెద్ద విద్యుత్ స్తంభం ఉంది. దీనికి అతి సమీపంలో తవ్వకాలు సాగుతుండటంతో భవిష్యత్తులో ఈ స్తంభానికి ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలుస్తోంది. ఇది వరకే విద్యుత్‌శాఖ అధికారులు కూడా మొరం తవ్వకాలు చేపడుతున్న వారిని హెచ్చరించినట్లు తెలిసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొరం తవ్వకాలకు అనుమతులు లేకపోయినా జిల్లా కేంద్రానికి అతి సమీపంలో యథేచ్ఛగా ఈ దందా కొనసాగుతున్నా ఉన్నతాధికారులు అటువైపు దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. జిల్లాలో మొరం తవ్వకాల మాదిరిగానే జిల్లా సరిహద్దులో ఉన్న పెన్‌గంగ నదిలోనూ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నదితో పాటు సుంకిడి, ఉండం, అర్లి(కె), రుయ్యాడి తదితర గ్రామాల సమీపంలోని వాగుల్లోంచి కూడా ఇసుకను తోడేసి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు వాటిని కట్టడి చేయడం లేదు. ఇలా సహజ వనరులను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నా కట్టడి చేయడంలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





సీరియస్‌గా హెచ్చరించాం : రవిశంకర్, ఏడీ

కజ్జర్లలో మొరం తవ్వకాలను ఇటీవల నిలిపివేశాం. వాహనాలను సీజ్ చేసి పెనాల్టీ కూడా వేశాం. తవ్వకాలు జరుపుతున్న వారిని సీరియస్‌గా హెచ్చరించాం. మళ్లీ తవ్వకాలు జరుగుతున్న విషయమై దృష్టి సారిస్తాం.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ - హాజీపూర్

మహీంద్రా ట్రాక్టర్ షోరూం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల సబ్బపల్లి, ముల్కల్లలో 10వ తరగతి విద్యార్థులు 100 మందికి ఒక్కొక్కరికి 8ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షోరూం మేనేజర్ మాట్లాడుతూ కరీంనగర్, ఆదిలాబాద్, మంచిర్యాల కేంద్రాల్లో ఉన్న షోరూంల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసి సాయం చేయాలనుకున్నామని తెలిపారు. సబ్బపల్లి, ముల్కల్ల హెచ్ఎంలు పద్మజ, గణపతిరెడ్డి మాట్లాడుతూ అవకాశాన్ని విద్యార్థులు చక్కగా ఉపయోగించుకొని మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జూపాక రాజేశ్వరి ధర్మయ్య, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రస్తుత వానాకాల సీజన్‌లో ఈ-పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించి అమ్మకాల్లో స్టాకు నిల్వలో డీలర్లు పారదర్శకత పాటించాలని మండల వ్యవసాయాధికారి గొర్లపల్లి రామక్రిష్ణ ఆదేశించారు. స్థానిక ఎరువుల దుకాణాలు, గోదాంలను సోమవారం తనిఖీ చేశారు. ఎరువుల పంపిణీ, నిల్వలపై సమీక్షించారు. మండలంలో వానాకాలం పంటలకు 80 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. డీలర్లు ఈ-పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు అమ్మాలన్నారు. కొంతమంది డీలర్లు ఈ-పాస్ ద్వారా విక్రయించకపోవడంతో వారికి స్టాప్ సేల్ ఆదేశాలు జారీ చేశారు. తప్పనిసరిగా ఈ-పాస్ యంత్రంతో రైతు వేలిముద్ర తీసుకుని మాత్రమే విక్రయాలు జరపాలన్నారు. ఎప్పటికప్పుడు యంత్రంలో ఉన్న స్టాక్, గోదాంలో ఉన్న స్టాక్ సరిగ్గా ఉండాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు అనవసరమైన ఎరువులు, పురుగుమందులు విక్రయించవద్దని, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఏఓ వెంట ఏఈఓ శ్రీనివాస్, డీలర్లు, రైతులు ఉన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై పీడీ యాక్ట్ కేసు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నడిపెల్లి లక్ష్మీకాంతారావు హత్య, అక్కడి ప్రజల బెదిరింపుల వంటి నేరాలకు పాల్పడిన మామిడి శ్రీనివాస్(37)పై రామగుండం కమిషనర్ రెమా రాజేశ్వరి పీడీ యాక్టు కేసు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం నిందితునికి మందమర్రి సిఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ బి.అశోక్ ఉత్తర్వులు అందజేసి చర్లపల్లి కేంద్ర కర్మాగారానికి తరలించారు. నిందితునిపై పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయని, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ హత్య, నేరపూరిత బెదిరింపులు వంటి నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనకు గురి చేయడంతో పీడీ యాక్టు కింద కేసు నమోదైందని సీఐ, ఎస్ఐ తెలిపారు. నేరస్తునిపై పీడీ యాక్ట్ నమోదుకు కృషి చేసిన బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ, రామకృష్ణాపూర్ ఎస్ఐని సీపీ అభినందించారు.

ప్రజావాణికి పోటెత్తిన అర్జీదారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. భూసంబంధ సమస్యలు, పింఛన్, ఉపాధి కల్పన, పౌర సరఫరాలు, విద్య, రెవెన్యూ, రెండుపడక గదుల ఇళ్లు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు తదితర సమస్యలపై అర్జీలను కలెక్టర్ స్వీకరించి వాటి పరిష్కారానికి ఆయా శాఖాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితబంధు పథకాన్ని సమగ్రంగా అమలు పరచాలి

నవతెలంగాణ-నస్పూర్

దళితబంధు పథకాన్ని సమగ్రంగా అమలుపరచాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న అన్నారు. దళిత బంధు పథకంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని సోమవారం నస్పూర్ మండల తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 25 ను సవరించాలని, గృహలక్ష్మి పథకానికి ప్రతి నియోజకవర్గంలో ప్రతి దళిత కుటుంబానికి వర్తింపచేయాలని, ఇల్లు నిర్మాణానికి రూ.10 లక్షల ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వ భూములు నివాసం ఉంటున్న వారికి జీవో నెంబర్ 58, 59 ప్రకారం పట్టాలి ఇవ్వాలని, పేదల ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ భూమి లేకపోతే ప్రైవేట్ భూమిని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇవ్వాలని, భూ పంపిణీకి అసైన్డ్ ల్యాండ్ కమిటీని పునరుద్ధరీకరణ చేయాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ పిలుపులో భాగంగా దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ పిలుపులో భాగంగా తమ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి సమస్యల పరిష్కారం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాశి పాక లింగయ్య,కౌటం శ్రీనివాస్, గోడిసెల రాజు,లక్ష్మణ్,రవికుమార్,కొమురయ్య,రవి తదితరులు పాల్గొన్నారు.

జీడిచేను పాఠశాలలో ఎల్ఈసీ ప్రోగ్రాం

కాగజ్‌నగర్ రూరల్ : జీడిచేను ఎంపీపీఎస్ పాఠశాలలో సోమవారం లెర్నింగ్ ఎంహాస్‌మెంట్ సెంటర్ (ఎల్ ఈసీ)ని ఉపాధ్యాయులు పుల్లూరి బాలకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల రాత అభ్యసన కృత్యాల అభివృద్ధే లక్ష్యంగా ఎల్‌ఈసీని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రం విద్యార్థులకు సాయంత్రం 4.30 నుంచి 6 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. పిల్లలు ఎక్కువ సమయం చదువుకు కేటాయించడం వల్ల వారి అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే 6నుండి నిరవధిక సమ్మె



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 6నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్లు వివిధ సంఘాల నాయకులు హెచ్చరించారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మిక సంఘ నాయకులతో కలిసి ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్టియు నాయకులు ధర్నా నిర్వహించి డిఆర్వో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. పిఆర్సిలో నిర్ణయించిన ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్ బిల్ కలెక్టర్లకు పంచాయతీ సెక్రటరీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు 10లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలన్నారు. రోజుకు 8 గంటల పని దినాన్ని అమలు చేయడంతో పాటు ఆదివారాలు సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్ల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని, లేదంటే 6నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు. ఇన్చార్జి డిపిఓ సురేందర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, రాజు, నాయకులు వెంకటేశ్వర్, శంకర్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దివాకర్, ఉపేందర్ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సంస్కృతిని పెంచేలా రూపొందించిన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంస్కృతిని పెంచేలా రూపొందించిన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటింటా ఇన్నోవేటర్‌పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సృజనాత్మకతతో నేటి సమాజానికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలు చేసిన ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం కింద ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, వీడియోను ప్రతి ఒక్కరికి తెలిసేలా వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేసి విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆసక్తి ఉన్న జిల్లా అధికారులు, సిబ్బంది, ఇతరులు ఎవరైనా నూతన ఆవిష్కరణలు చేసినట్లయితే, ఆ ఆవిష్కరణకు సంబంధించిన 4ఫొటోలు, 2 నిమిషాల వీడియోను, ఆవిష్కర్త ఫొటో, వివరాలను సెల్ నంబర్ 9100678543కు వాట్సాప్ చేయాలని అన్నారు. అనంతరం ఇంటింటా ఇన్నోవేషన్‌కు సంబంధించిన కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్.నటరాజ్, జడ్పీ సీఈఓ గణపతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శైలజ, టీఎస్ఐసీ బృందం సభ్యులు పవన్ కెళ్ల, ఆదర్శ్ మహేంద్ర, ఈడీయం రవి పాల్గొన్నారు.



గాల్లో కలిసిన కూలీల ప్రాణాలు

- మృత్యువులోనూ వీడని సోదరబంధం



నవతెలంగాణ - కౌటాల

మృత్యువు వారి బంధాన్ని విడదీయలేకపోయింది. ప్రమాదంలో అన్నదమ్ములిద్దరూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఒకేమాట ఒకే బాటగా నడయాడిన అన్నదమ్ములిద్దరూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. బెజ్జూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన బుర్రి అంసుబాయికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలు చిన్నవయసులో ఉండగాగ్ భర్త మరణించాడు. దీంతో కూలీ పని చేస్తూ పిల్లలను పోషించింది. కూతురు వివాహం సైతం చేసింది. ఎదిగిన కొడుకులు ఇద్దరు కూలిపని చేస్తూ తల్లికి చేదోడుగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వైగాం నుంచి గుడ్లబోరికి విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్‌లో తరలించేందుకు కూలీపనికి వెళ్లారు. విద్యుత్ స్తంభాలతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీపై అన్నదమ్ములు బుర్రి వసంత్(22), బుర్రి అనిల్(20) కూర్చున్నారు. వైగాం సమీపంలో ఒక్కసారిగా ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడింది. అన్నదమ్ములిద్దరూ కిందపడగా వారిపై విద్యుత్ స్తంభాలు పడడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని సీఐ ఎండీ సాధిక్ పాషా, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. మృతుల తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించారు. చేతికందవచ్చిన కొడుకులిద్దరూ కానరాని లోకాలకు వెళ్లడంతో ఆ తల్లి కన్నీరు మున్నీరై విలపించింది. మృతుల కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీష్ పరామర్శించి సంతాపం తెలిపారు.

బృహత్ పల్లెప్రకృతి వనంలో నాటిన మొక్కలేవి?



కెరమెరి : జోడేఘాట్ బృహత్ పల్లెప్రకృతి వనంలో నాటిన మొక్కలేవని కుమురంభీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జోడేఘాట్ బృహత్ ప్రకృతి వనంలో సుమారు 18వేల మొక్కలు నాటినట్టు రికార్డుల్లో నమోదు చేశారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లైతే కేవలం 2వేల పైచిలుకు మొక్కలు మాత్రమే ఉన్నాయన్నారు. మిగతా మొక్కలు ఏమయ్యాయని అధికారులను ప్రశ్నించారు. నాటిన మొక్కలకు నిర్వహణ చెల్లింపులు ఎలా చేశారని ప్రశ్నించారు. మొక్కలు నాటకుండా నాటినట్లు రికార్డుల్లో చూపడమే కాకుండా గ్రామస్తులే పశువుల చేత నాశనం చేశారని అధికారులు, గ్రామస్తులను నిందించడం సరైంది కాదన్నారు. జోడేఘాట్‌లో పశువులకు మూడు కాలాలు మేత దొరుకుతుందని, పశువుల చేత మొక్కలను నాశనం చేసే సంస్కృతి ఆదివాసులకు లేదన్నారు. బృహత్ ప్రకృతి వనంలో 18వేల మొక్కలు నాటినట్టు రికార్డుల్లో నమోదు చేసినప్పటికీ తనిఖీలు చేపట్టకుండా బాధ్యత కల్గిన అధికారి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి భీం పురిటి గడ్డ జోడేఘాట్ బృహత్ ప్రకృతి వనం నాటిన మొక్కలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు సెడ్మకి తుకారాం, భీంరావు పాల్గొన్నారు.

మూడు రోజులు ఎండీఎం కార్మికుల టోకెన్ సమ్మె

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్



ఈ నెల 10, 11, 12న మూడు రోజుల పాటు మధ్యాహ్న భోజన కార్మికులు వంటలు చేయకుండా టోకెన్ సమ్మె చేపట్టనున్నట్టు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం(సీఐటీయూ) తిర్యాణి మండల అధ్యక్షురాలు మడావి చంద్రకళ తెలిపారు. సోమవారం తిర్యాణి మండల ఎమ్మార్సీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ రాముకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ 10, 11న మండల ఎమ్మార్సీ కార్యాలయం వద్ద, 12న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద టోకెన్ సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. టోకెన్ సమ్మెలో సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఏడాది కాలంగా తమ సంఘం పోరాట ఫలితంగా ప్రభుత్వం 2023 ఫిబ్రవరి 3న జీవో ఎమ్ఎస్ నెం. 8 విడుదల చేసిందని, జీఓ విడుదల చేసిన నాటి నుండి ఎరియర్స్‌తో సహా చెల్లించాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామన్నారు. అయినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదని, మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పజెప్పాలనే నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం అమలైతే వేలాది మంది కార్మికుల ఉపాధి పోతుందని, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాన్ని ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల ఉపాధ్యక్షులు వెద్మ ఊర్మిళ, కార్మికులు సుశీల, రాంబాయి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నార్నూర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నవతెలంగాణ-ఇచ్చోడ

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సాగర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సికిల్‌సెల్, అనీమియా వ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ సికిల్‌సెల్, అనీమియా దీర్ఘకాలిక రక్తహీనత వ్యాధి అని తెలిపారు. అలసట, లేత చర్మం, శ్వాస ఆడకపోవడం, ఇన్ఫెక్షన్, కామెర్లు, కంటి సమస్యలు వంటి వ్యాధి లక్షణాలుంటాయని తెలిపారు. వ్యాధి బారిన పడిన వ్యక్తి పెరుగుదల ఆలస్యంగా ఉంటుందని, ఉదరం, ఎముకలలో తీవ్రమైన నొప్పి ఉంటుందని తెలిపారు. మేనరిక పెండ్లిళ్లు, వంశ పారంపర్య వల్ల 400 మందిలో ఒకరు వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజ్‌కిరణ్‌రెడ్డి, సూపర్‌వైజర్ సుభాష్, ఏఎన్ఎం సుధ పద్మ, తులసీ పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రామ్‌బాబు, హెల్త్ సూపర్వైజర్ చరణ్‌దాస్ తెలిపారు. 64 మంది పిల్లలకు సికిల్‌సెల్, అనీమియా పరీక్షలు నిర్వహించామన్నారు. మండలంలో మూడు టీంలను ఈ పరీక్షల కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. వారంలో ప్రతి సోమ, మంగళ, గురు, శుక్ర వారాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో హెచ్‌ఈఓ నాందేవ్, ప్రధానోపాధ్యాయులు రాథోడ్ ధర్మేందర్, జాదవ్ విఠల్, వైద్య సిబ్బంది అదీప్, హిమ, షీలాసింధు, జంగుబాయి, విద్యారాణి, ఈశ్వర్, జవహర్‌లాల్, గోకుల్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పార్డి(బి) గ్రామంలో ఆదివాసీ రైతుల ఆధ్వర్యంలో సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పోడు రైతులకు పట్టాలు అలాగే భీమా సదుపాయాలు కల్పించినందుకు ఆయనకు రుణపడి ఉంటామని అన్నారు. అలాగే నూతనంగా పోడు భూముల పట్టాలు పొందిన ఆదివాసులు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జుగ్నక్ మారుతి, ఆదివాసీ రైతులు రావుడు, జంగు, సుంగు, లక్ష్మణ్, జగదీష్, ధర్మన్న పాల్గొన్నారు.



సేవాలాల్ అడుగు జాడల్లో నడవాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ రామారావ్ చూపిన మార్గంలో నడవాలని బంజారా యువ సేన జిల్లా అధ్యక్షులు రాథోడ్ సంజయ్ నాయక అన్నారు. గురుపౌర్ణమిను పురస్కరించుకుని ఆయన సోమవారం మహారాష్ట్రలోని పవిత్ర పౌరదేవి ఆలయాన్ని సందర్శించుకున్నారు. జగదంబా దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంత్ సేవాలాల్ రామారావ్ మహారాజ్ దర్శనం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. ఆయన. బంజార సమాజం కోసం ఏనలేని కృషిచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడే ప్రేమ్, రవీందర్, సందీప్ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-బేల

భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ అజాద్‌పై గుర్తుతెలియని వ్యక్తులు తుపాకితో కాల్పులో గామపడి, తృటిలో ప్రాణాపాయం తప్పిందని భవిష్యత్తులో అతనికి ప్రాణాపాయం ఉన్నందున అతనికి కేంద్రం సెక్యూరిటీతో రక్షణ కల్పించాలని కోరుతూ బీమ్ ఆర్మీ రక్షక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంవిదాన్ రక్షక్ దల్ బీమ్ ఆర్మీ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ నిమ్ సట్‌కర్ మాట్లాడుతూ బీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ అజాద్ ఉత్తర్‌ప్రదేశ్ సహరాన్‌పూర్‌లో వెళ్తుండగా దేవ్‌బంద్ గ్రామ సమీపంలో జూన్ 28న 5గంటలకు గుర్తు తెలియని దుండగులు అతని పైన కాల్పులు జరుపగా అతనికి తీవ్రగాయాలైన ప్రాణాపాయం తప్పిందని అన్నారు. అతనికి జెడ్ సెక్యూరిటీ కల్పించాలని తహసీల్దార్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బబ్లు నింసట్‌కర్, షారుక్, వికాస్, చంద్రమని, అజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి



నవతెలంగాణ-కుభీర్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ విశ్వంబర్, ఎంఈఓ చంద్రకాంత్ కేజీబీవీ ఎస్‌ఓకు సూచించారు. సోమవారం ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల అధికారులు విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి పాఠశాలలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అన్న విషయాన్ని విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య నాణ్యతతో కూడిన భోజనం అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వీణ అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ పాఠశాలలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు సికిల్ సెల్ ఏనిమియా పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులకు రక్తపు నమూనాలను సేకరించి, పరీక్షలు జరుపడం జరిగిందని, హెల్త్ అసిస్టెంట్ బలరాం తెలిపారు. విద్యార్థులకు జరిపిన మొత్తం రక్తం ఫలితాలని ఆన్‌లైన్‌లో పెట్టడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాస్, సిబ్బంది సుగుణ, పద్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-నార్నూర్

గురు పౌర్ణమి దినోత్సవం సందర్భంగా సోమవారం తాడిహత్నూర్‌లో మాతంగ్ రుషి సంస్కార కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కార కేంద్రం సభ్యులు మాతంగ్ రుషి, సద్గురు పులాజీబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ గురువు చూపించిన మార్గంలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో మాతంగ్ రుషి సంస్కార కేంద్ర వ్యవస్థాపక అధ్యక్షులు సుర్యవంశీ, పండరి, ఉపాధ్యక్షులు సాగురే పాండురంగ్, సభ్యులు నర్సింగ్ మోరే, రామారావ్, సదాశివ్ మెట్టే, వాగ్మారే వామన్, అరవింద్ కల్వలె, అనురుద్రు, దత్తరాజ్, భక్తులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విద్యార్థుల పుస్తకాలు, యూనిఫాంలు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పోచ్చర సెయింట్ థామస్ పాఠశాలలోని అధిక ధరలతో పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్ట్, నోట్ బుక్‌ల పేరుతో విద్యను వ్యాపారం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తూ గతంలో అధికారులకు విన్నవించినా పట్టించు కోవడం లేదని సోమవారం ఏఐఎస్ఎఫ్ ఇచ్చిన వినతిపత్రాలను చించేసి నిరసన వ్యక్తం చేశారు. బోథ్‌తో పాటు జిల్లాలోని ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలలో ముఖ్యంగా బోథ్ సెయింట్ థామస్ పాఠశాలలో విద్యను వ్యాపారం చేస్తున్నారని డిమాండ్ చేశారు. విషయాన్ని ఎంఈఓ, డీఈఓ, తహసీల్దార్, కలెక్టర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా, ప్రేమ్, మున్సిఫ్, నరేష్, కాజిమొద్దిన్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన మండల అధ్యక్షుడు

నవతెలంగాణ-సిరికొండ

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో నెలకొన్న సమస్యలను వివరించారు. మండల కేంద్రం నుండి వాయిపేట్ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం, చిక్‌మాన్ ప్రాజెక్ట్ ఎత్తు పెంచి రైతులకు సాగునీరు అందించి న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు సరైన విద్య, వైద్యం అందేలా, నూతన మండల కేంద్రంలో సరైన మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ తరపున కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వం కైతీ లబానాలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్ర ప్రభుత్వం కైతి లబానాలకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని కైతీ లబానాల (మథుర) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు థాన్ సింగ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 9ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ వరకు కైతి లబానాల (మథుర)కు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదనీ అన్నారు. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కైతి లభానాలను ఎస్టీ హోదాలో చేరుస్తామని, తీర్మానం చేసి ఇప్పటివరకు ఆ హామీను నెరవేర్చక పోవడం దారుణమని అన్నారు. తమకు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కైతి లబానాల సంఘం జిల్లా కోశాధికారి చోపాడే బద్దు సింగ్, సభ్యులు నిధాన్ సింగ్, ఇందల్ సింగ్, కర్తార్ సింగ్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

- మున్సిపల్ కార్యాలయం ముందు బైటాయింపు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళలు సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో బైటాయించి నిరసన తెలిపారు. పది రోజుల నుంచి నీళ్లకోసం అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీళ్ల రాక, స్థానికంగా ఎంలాటి నీటి వసతి లేక అవస్తలు పడుతున్నామని కౌన్సిలర్, చైర్మెన్, కమీషనర్‌కు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాళీ బిందెలను ప్రదర్శించారు. సుభాష్‌నగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని చైర్మెన్ అంకం రాజేందర్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ పాషా పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

విద్యార్థులను అధిక ఫీజులు వసూలు చేస్తున్న మండల కేంద్రంలోని ప్రయివేట్ పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పరత్ వాగ్ దత్త అన్నారు. సోమవారం ఎంఈఓ నారాయణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలల యజమానులు విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా అడ్మిషన్, ఫీజుల పేరిట అధికంగా దండుకుంటున్నారని ఆరోపించారు. విద్యా అనేది ప్రతి ఒక్కరి హక్కు అని అన్నారు. అలాంటి విద్యకు ప్రయివేట్ పాఠశాలలు ధనార్జనే లక్ష్యంగా పనిచేస్తున్నాయని అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అనాథ పేద పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని అన్నారు. అదేవిధంగా ప్రయివేట్ పాఠశాలలో సైతం బీఈడీ, డీఎడ్, చేసిన అర్హులైన అభ్యర్థులచే విద్యా బోధన చేయాలన్న నిబంధనలు ఏ పాఠశాలలో అమలు చేయడం లేదన్నారు. ఎంఈఓ ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో బాబాసాహెబ్, పెందుర్ అంకుష్ ఆతిష్, సునీల్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని స్వీపర్ల రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-కడెం

తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు తమ సమస్యల పరిష్కారానికి సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పక్కన రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా స్కూల్ స్వీపర్ల సంఘం జిల్లా అధ్యదక్షుడు మహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలో గత 35, 40 సంవత్సరాలగా ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లుగా పనిచేస్తున్నామని అన్నారు. నిర్మల్ జిల్లాలో 54 మంది స్వీపర్లు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నారని అన్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 244 మంది దాదాపు 1980 నుండి పాఠశాల స్వీపర్లుగా ప్రభుత్వ ఆర్డర్ కలిగి ఉండి ఎంపీడీఓ నుండి ఆర్డర్ కలిగి ఉండి ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు కనీస వేతనం కూడా చెల్లించడం లేదని అన్నారు. మాలోని కొందరికి 61 సంవత్సరం నిండగానే రిటైర్‌మెంట్ ప్రకటిస్తూ ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని తీసేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు మూడు నెలలకు ఒకసారి వేతనం వస్తుందని, తమ వేతనం నెల నెలకు అందజేయాలని అన్నారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని కలెక్టర్, డీఎస్పీ, జెడ్పీ సీఈఓలకు అందజేశామని తెలిపారు.



కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు ఎండీ బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ సత్తెన్న, కార్యదర్శి గంగన్న, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య



నవతెలంగాణ-జైనథ్

సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం పూర్తి చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల నడుమ వేడుకలు నిర్వహించుకున్నారు. ముందుగా మాండగాడ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ప్రభాకర్‌తో కలిసి విద్యార్థులకు బూట్లు అందించారు. అదేవిధంగా మండలంలోని పెండల్‌వాడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలను విద్యార్థుల మధ్య నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్, సర్పంచ్ నవనీత సురేష్, ఎంపీటీసీ అశోక్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు లింగారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

నవతెలంగాణ-నిర్మల్

ప్రమాదవశాత్తు చెరువులో పడి మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన బంగాల్‌పేట్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లోని వృద్ధాశ్రమంలో ఆదివారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. మున్సిపల్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు పూర్తి చేసి సమీపంలో ఉన్న బంగల్ పేట్ వినాయక్ సాగర్ చెరువులో మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి చిన్నూ స్నానానికి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. విషయం తెలుసుకున్నా పలువురు అక్కడికి చేరుకొని గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టగా అప్పటికే మృతి చెందాడు. సోమవారం మున్సిపల్ చైర్మెన్ కమిషనర్ సీవీఎన్ రాజు దగ్గరుండి జిల్లా ప్రధాన ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం చేయించారు. మృతదేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి చిన్నూ మరణం బాధాకరమని, కుటుంబ సభ్యులకు తీరాని లోటని, అతని కుటుంబానికి అండగా ఉంటామని చైర్మెన్ హామీ ఇచ్చారు. ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో డబుల్ బెడ్ రూమ్, అతని భార్యకి ఉద్యోగం, పిల్లల చదువులకు అండగా ఉంటామని, ప్రభుత్వం పరంగా అన్ని రకాలుగా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చైర్మెన్ వెంట కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

మురికి వాడల్లో కనీస సౌకర్యాలు కరువు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మురికివాడల్లో కాలనీవాసులకు కనీస సౌకర్యాలు లేవని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 170 కాలనీలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ మున్సిపాలిటీ బ్రోకర్లకు అడ్డాగా మారిందని ఆరోపించారు. అభివృద్ధి కేవలం ఎమ్మెల్యే కుటుంబంలోనే జరిగిందని అన్నారు. పట్టణంలోని మురికివాడల్లో కనీస వసతులు లేక ప్రజలు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసుకునే వారికి వెంటనే పట్టాలు అందిస్తారని అన్నారు. కానీ అర్హులైన వారికి కేటాయించిన ఇండ్లకు పట్టాలు ఇవ్వకుండా వారిని నరకాయయాతనకు గురి చేస్తూన్నారని అన్నారు. మంచినీటి వ్యవస్థ లేదని అన్నారు. మిషన్ భగీరథ పేరుకు మాత్రమే నల్లాలు ఉన్నాయి, మురికివాడలోని పిల్లలు విద్యకు దూరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, రఘుపతి, రత్నాకర్‌రెడ్డి, గంగారెడ్డి, స్వామిరెడ్డి, ఆత్రం సాయి, నవీన్ ముదిరాజ్, భూమేష్, సాయి, రాజేష్, ధోని జ్యోతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఈత చెట్లను నాటిన ఎమ్మెల్యే


నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీలో నిర్వహించిన గౌడ గడప హరితాహారం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈత చెట్లను నాటి నీరు పోశారు. ముందుగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం హరితాహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని అన్నారు. హరితాహారాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో 7శాతం అడవులు పెరిగిన విషయాన్నీ గుర్తు చేశారు. గౌడ కులస్తులు ఐక్యంగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, గౌడ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు గజనంద్, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, నాయకులు పందిరి భూమన్న, సాజిదోద్దీన్, స్వరూప రాణి, నల్ల మహేందర్ పాల్గొన్నారు.

అనాథలకు బట్టలు పంపిణీ

ఘనంగా ముందస్తు ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలు ముందస్తు ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్‌లో ఉన్న నిరుపేదలకు మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ చేతుల మీదుగా బట్టలను పంపిణీ చేసి, అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. అనాథలుగా రహదారులపై తిరుగుతున్న వారిని గుర్తించి, వారికి క్షౌరం చేయించి, కొత్త బట్టలు అందించి, దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా సామజిక సేవ కార్యక్రమాలను నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక జనార్ధన్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించే మెగా రక్తదాన శిబిరంలో అభిమానులు, పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, నాయకులు మిషు, ఎజాజ్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎంపీపీ

నవతెలంగాణ-ఇచ్చోడ



మండల కేంద్రంలోని ఆదిలాబాద్ బైపాస్ నుంచి నిర్మల్ బైపాస్ వరకు సెంట్రల్ లైటింగ్‌తో పాటుగా రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన మంత్రి కేటీఆర్‌ను ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి కృత్జతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అతి త్వరలోనే సెంట్రల్ లైటింగ్, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాబోతునట్లు తెలిపారు. దీనితో మండల ప్రజలు ఎదుర్కొంటున్నా ఇబ్బందులు తొలగనునట్లు తెలిపారు. ఆయన వెంట ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి ఉన్నారు.

నాగోబాను దర్శించుకున్న పీఓ దంపతులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటీవల ఉట్నూర్ ఐటీడీఏ పీఓగా వచ్చిన చాహత్ బాజ్‌పేయి కలెక్టర్ వరుణ్‌రెడ్డి దంపతులు కేస్లాపూర్‌లోని గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు పటేల్ వెంకట్‌రావు, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్ తదితరులు వారికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన పీఓ మాట్లాడుతూ నాగోబా అభివృద్ధికి మెస్రం వంశీయులతో కలిసి కృషి చేస్తామన్నారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని కార్యక్రమ వివరాలను తెలియచేశారు. మంగళవారం పట్టణంలోని జనార్ధన్‌రెడ్డి గార్డెన్స్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలన్నారు. అంతకుముందు ఇటీవల బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా నియామకమైన గంగారెడ్డికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియచేశారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఆర్యవైశ్యులను ఆదుకునేలా ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని ఆర్యవైశ్య మహాసభ ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఎన్నికలలోపే ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రకటించాలని కోరారు. సోమవారం సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ వినతి ప్రభుత్వానికి చేరవేసేలా కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి సంపత్, ప్రధాన కార్యదర్శి రంగా మదన్మోహన్, ప్రతినిధులు ప్రసాద్, పడిగెల రాజేష్, కొత్త హరీష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టు మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టు రెండో నెంబర్ వరద గేట్ కౌంటర్ వేట్ మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఐఎఫ్‌టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం వచ్చినప్పటికీ ప్రాజెక్టు మరమ్మత్తుల పనులు నత్త నడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలు కురిస్తే ప్రాజెక్టు గేటు ఎత్తలేని పరిస్థితి ఉంటుందని అన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రాజెక్టు మరమ్మతుల పనులను వేగంగా పూర్తి చేయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత వర్షాకాలం వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్టు పనులు నేటికీ పూర్తి కాకపోవడం సరి కాదన్నారు ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు లింగన్న, రైతులు పాల్గొన్నారు.

దళితబంధులో మాంగ్ కులస్తులకు ప్రాధాన్యతనివ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

షెడ్యూల్డ్ కులాల వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు లబ్దిదారుల ఎంపికలో మాంగ్ కులం వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షులు గాడేకర్ పరశురాం కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. మొదటి విడత దళితబంధు ఎంపికలో అత్యంత వెనుకబడిన మాంగ్ కులం వారికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రెండో విడత దళితబంధు లబ్దిదారుల ఎంపికలో తమకు తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాంగ్ సమాజ్ పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు బి విష్ణు, సంయుక్త కార్యదర్శి కాంబ్లే సాయి, సూర్య, వంశీ, సాయి, ప్రధాన కార్యదర్శి కాంబ్లే కచురు, గవలే రవి ఉన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 04 జూలై 2023

వర్షాకాల వ్యాధుల నివారణ అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-నస్పూర్

వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధుల నివారణపై సోమవారం ఎస్ఆర్పీ-1 గనిలో కానీ మేనేజర్ విజయకుమార్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, వాటి పర్యాసనాలు వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన తగు జాగ్రత్త గురించి వివరించారు. ముఖ్యంగా కలుషితమైన నీటిని తాగడం వలన కలరా, రక్త విరోచనాలు, నీళ్ల విరోచనాలు, పోలియో, ఇన్‌ఫెక్షన్, హైపటైటిస్ వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. నీటిని శుభ్రపరిచి తాగాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి రాజేష్ బాబు, అండర్ మేనేజర్ నరేష్, ఇంజనీర్ రాజేందర్, వెల్ఫేర్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు.

రైతు అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్

నవతెలంగాణ-కౌటాల

స్వరాష్ట్రంలో రైతులు అభివృద్ధి చెందడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం కౌటాల, ముత్తంపేట్ గ్రామాల రైతువేదికల్లో వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీ విత్తనాలలను రైతులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి సభ్యులు అనుశెట్టి రాంచందర్, ఎర్రోళ్ల ఎల్లయ్య, బీఆర్ఎస్ యువజన సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, నాయకులు డబ్బ గోపాల్, సోళ్ల బాపు, వ్యవసాయ విస్తరణ అధికారులు రవికుమార్, శ్రీలత పాల్గొన్నారు.

పోడు పట్టాదారులకు రైతుబంధు అందజేస్తాం

- జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మీ, ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నవతెలంగాణ-కెరమెరి

పోడు పట్టాలు పొందిన లబ్దిదారులకు రైతు బంధు సైతం అందజేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మీ, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో పోడు రైతులకు 1025 పోడు పట్టాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పోడు రైతులకు రైతు బంధు ఈ సీజన్ నుండే అందిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షించ దగ్గ విషయమన్నారు. ప్రభుత్వం అందించే రైతు బంధును వ్యవసాయంలో పెట్టుబడికి వినియోగించాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టనటువంటి పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే అనేక మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందూర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ద్రుపతబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం, సర్పంచ్ బయన బాయి, ఎంపీటీసీ ఇష్తే కార్ అహ్మద్, సర్పంచులు తొడసం జగన్నాథ్‌రావు, కుంరం నాణేశ్వర్, ధనోర సర్పంచ్ మడావి చిలుక, ఎంపీడీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

సమ్మె విరమించిన బ్లాస్టింగ్ కార్మికులు



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా కేకే ఓబిలో తమ వేతనాలు పెంచాలని 3 రోజులుగా బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మెను ప్రాజెక్ట్ అధికారి హామీతో సమ్మెను సోమవారం నుంచి తాత్కాలికంగా విరమించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మిక సంఘం సీఐటీయు రీజినల్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15 నుంచి కార్మికులు తమ వేతనాలు, ఇతర సమస్యలపై సమ్మె చేపట్టారు. ఆర్‌వీఆర్ కాంట్రాక్టర్ వారి సమస్యలను పరిష్కరించి, వేతనాలు పెంచుతామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించారు. కానీ ఐదు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడంతో తప్పని పరిస్థితిలో విధులు బహిష్కరించి బ్లాస్టింగ్ కార్మికులు తమ నిరసన వ్యక్తం చేసారని, సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ వద్దకు వెళ్లి కలవడం జరిగిందన్నారు. ప్రాజెక్ట్ అధికారి సానుకూలంగా స్పందించి ఆర్‌వీఆర్ కాంట్రాక్టర్ ఒప్పుకున్నాడో దాని ప్రకారం వేతనాలు ఇప్పిస్తామని అలాగే ఇతర సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించి విధులు లోకి వెళ్లడానికి ఒప్పుకోవడం జరిగిందని తెలిపారు. ఇచ్చిన హామీలను నెల లోపల అమలు చేయకపోతే పోరాటాన్ని మరోసారి ఉధృతంగా చేస్తామన్నారు. పోరు బాటలో భాగంగా కేకే ఓసిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కరపత్రాలను పంచారు. ఈ నెల 5వ తేదీన మందమర్రి జీఎం ఆఫీస్ ముందు ధర్నా, 14వ తేదీన కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా, జులై 27న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు రెండు రోజుల దీక్ష కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. ఈ పోరుబాటలో కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మరాజు, రవి, లింగమూర్తి, సంపత్, శ్రీను, సాగర్, రాజు, రమేష్, మహేష్, గట్టయ్య, సత్యపాల్ పాల్గొన్నారు.

'దేశం కేసీఆర్ వైపు చూస్తోంది'



నవతెలంగాణ-హాజీపూర్

దేశం కేసీఆర్ వైపు చూస్తోందని పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని టీకన్నపల్లిలో రూ.5లక్షల నిధులతో నిర్మించనున్న కాపు సంఘం భవనానికి భూమి పూజ చేశారు. ముందుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ తెలంగాణాలో అమలవుతున్న పథకాలు దేశంలోని మరే రాష్ట్రం లేవని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల కోసం తీసుకువస్తున్న సంక్షేమ పథకాలు ఈ రోజు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్ని కులాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి విజిత్ రావు, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, సర్పంచ్ రాంటెంకి మల్లేశ్వరి, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, ఎంపీటీసీ సోగాల సుజాత, ఉపసర్పంచ్ జితేందర్ రావు, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

9న మహాంకాళి బోనాల జాతర

కాగజ్‌నగర్ రూరల్ : ఈ నెల 9న పట్టణంలోని సర్ సిల్క్ ఏరియా మహాంకాళి బోనాల జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్టు బోనాల కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్ తెలిపారు. ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను చేయడం జరుగుతోందన్నారు. బోనాల శోభాయాత్ర లారీ చౌరస్తా నుండి మహంకాళి దేవాలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. శోభాయాత్రలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు బోనాల శోభాయాత్రలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఓం ప్రకాష్, వి.సోమనాథం, జగదీశ్వర్, వీరస్వామి, పెరక కృష్ణ పాల్గొన్నారు.

పని బారెడు..వేతనం బెత్తెడు..!

- 6 నుంచి జీపీ కార్మికుల ఆందోళన బాట
- అధికారులకు సమ్మె నోటీసులు అందజేత
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



నవతెలంగాణ-కెరమెరి

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేక పనిభారం పెరిగి జీపీ కార్మికుల పరిస్తితి 'పని బారెడు వేతనం బెత్తెడు' అన్నట్లుగా మారింది. గ్రామ పంచాయతీ కార్మికుల జీవితాలు ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్నారు. జనాభాకు అనుగుణంగా గ్రామపంచాయతీల్లో సరిపడా సిబ్బంది లేక పనిభారంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతూ విధులు నిర్వహిస్తున్నామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అరకొర వేతనాలు చెల్లించి వెట్టిచాకిరీ చేయించుకుంటోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని జీపీలలో ట్రాక్టర్ డ్రైవింగ్, ఎలాక్ట్రిసిటీ పనులు వచ్చిన సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారితోనే డ్రైవింగ్, ఎలక్ట్రిసిటీ పనులు చేయాల్సి వస్తుంది. దీంతో పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుని కార్మికులు మరణించిన సంఘటనలున్నాయి. వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6 నుంచి పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టనున్నారు.

హామీలను నెరవేర్చాలి

సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇస్తున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడకుంటే 6వ తేదీ నుంచి మండలాల వారీగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు కార్మికులు స్పష్టం చేస్తున్నారు. కార్మికులు సమ్మెబాట పడితే గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, విద్యుత్, తదితర సేవలపై తీవ్ర ప్రభావం పడనుంది.

చాలీచాలని వేతనాలు

జిల్లాలో మొత్తం 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 5,92831 గ్రామీణ జనాభా ఉంది. 1103 మంది జీపీ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి అదనంగా మరో 10 వేల మంది కార్మికులు గ్రామపంచాయతీల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 500 మంది జనాభాకు ఒక కార్మికుడు ఉండాలని 2018లో రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 51ని తీసుకొచ్చింది. జనాభాకు నుగుణంగా కార్మికులను నియమించి రూ.8500 వేతనం చెల్లిస్తున్నారు. మే డే సందర్భంగా రూ.1000 పెంచి 9500 చెల్లిస్తున్నారు. కానీ చాలా గ్రామ పంచాయతీల్లో కార్మికులకు ఆ జీఓలో పేర్కొన్న విధంగా వేతనాలు అందడంలేదనే ఆరోపణలున్నాయి. మరికొన్ని గ్రామ పంచాయతీల్లో గతంలో గ్రామ అవసరాలను బట్టి కార్మికులను ఉద్యోగంలోకి తీసుకున్నారు. అలాంటి గ్రామపంచాయతీల్లో ఎంతమంది కార్మికులు ఉన్నా రూ.8500 ల్లోనే సర్దుబాటు చేయాల్సి వస్తోంది. వాస్తవానికి ప్రతి పదేళ్లకోసారి జన గణన నిర్వహించాలి. 2021లో నిర్వహించాల్సిన జనాభ గణన నిర్వహించక పోవడం గ్రామ పంచాయతీ కార్మికుల పాలిట శాపంగా మారింది. ఈ పదేళ్ల కాలంలో జనాభా పెరగడం, పెరిగిన జనాభాకు సరిపడా కార్మికులను నియమించకపోవడంతో ప్రస్తుతం పనిలో ఉన్న కార్మికులపై పని భారం పడుతోంది. పంచాయతీ కార్మికుడు మృతిచెందితే రూ.2 లక్షల బీమా చెల్లించేందుకు సీఎం కేసీఆర్ నాలుగేళ్ల క్రితం హామీ ఇచ్చారు. కానీ నేటికీ ఇది అమలు కావడంలేదు. ప్రభుత్వం ప్రతి కార్మికుడికి బీమా సౌకర్యం కల్పించి ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇవి కార్మికుల డిమాండ్లు

జీఓ నెంబర్ 51 ప్రకారం మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి. మున్సిపల్ కార్మికుల మాదిరిగానే జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి. జీఓ నెంబర్ 212, 112లను సవరించాలని, ఈ జీఓలు వర్తించే వారందరినీ పర్మినెంట్ చేయాలి. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్ వంటి ఉద్యోగాల్లో పంచాయతీ కార్మికులకు అవకాశం కల్పించాలి. పర్మినెంట్ చేయడంతో పాటుగా, కారోబార్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలి. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేస్తూ రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి. జిల్లా కేంద్రంలో సోమవారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నోటీసును జిల్లా కలెక్టర్ కు అందజేసి ర్యాలీ నిర్వహించారు.



జీపీ కార్మికులను ఆదుకోవాలి

తిరుసుల్ల సంతోష్ జీపీ కార్మికుడు కెరమెరి

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. పెరుగుతున్న ధరలకు ప్రభుత్వం అందజేసే వేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలి. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర కార్మికులదే. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చి ఆదుకోవాలి.

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

గడ్డల వెంకటేశం జిల్లా అధ్యక్షుడు గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం

గ్రామాల్లో పారిశుధ్య పనులతో పాటు, ఇతర పనులు కూడా చేస్తున్నారు. ప్రభుత్వం మా కార్మికుల శ్రమను గుర్తించడం లేదు. అరకొర వేతనాలతో వెట్టిచాకిరి చేయిస్తోంది. ప్రభుత్వం ఇచ్చే వేతనాలు సరిపోక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మె కొనసాగిస్తాం.



ఇండ్ల పట్టాలు ఇవ్వకపోతే ప్రభుత్వ భూములు కబ్జా చేస్తాం

- ప్రజా సంఘాల నాయకుల హెచ్చరిక
- కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల పట్టాలు ఇవ్వకపోతే జిల్లాలోని ప్రభుత్వ భూములను పేదలతో కలిసి కబ్జా చేస్తానమి ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. జిల్లాలోని పేదల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున గృహలక్ష్మి లబ్దిదారులు తరలిరావడంతో మొదట లోపలికి అనుమతించలేదు. కలెక్టరేట్ ఎదుట గొడవ అయ్యే అవకాశం ఉండడంతో కలెక్టర్ వారిని లోపలికి పిలిపించుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అనేకమంది పేదలు ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చిందని నేటికీ వాటిని నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాల్లో కొంతమేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ జిల్లాలో కనీసం ప్రారంభం కూడా కాలేదని తెలిపారు. కలెక్టర్ స్పందించి సాధ్యమైనంత త్వరలో పేదలను గుర్తించి వారికి ఇండ్లు, ఇండ్ల పట్టాలు ఇవ్వాలని లేదంటే జిల్లాలో ప్రభుత్వ భూములను గుర్తించి కబ్జా చేసి పేదలతో ఇల్లు నిర్మించుకునేలా చేస్తామన్నారు. గతంలో కాగజ్‌నగర్ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేసిన ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వ భూమిలో ఒక గ్రామం వెలిసిందని అదే ఇప్పుడు సరిగా అయిందన్నారు. భవిష్యత్తులో ప్రతి చోట ఇదే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. కలెక్టర్ స్పందిస్తూ వచ్చిన వారు దరఖాస్తు ఇవ్వండని వారికోసం ప్రత్యేక ఏర్పాటు చేస్తానని ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో నాయకులు లబ్దిదారులు శాంతించారు. గృహలక్ష్మి దరఖాస్తు చేసుకున్న వారికి రసీదు ఇవ్వకపోవడంపై కొంత ఆందోళన చేయడంతో అధికారులు దరఖాస్తు చేసుకున్న వారికి రసీదు ఇచ్చి పంపారు. కలెక్టర్ హామీతో లబ్ధిదారులు వెనుదిరగారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, నాయకుడు ముంజం ఆనంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ నాయకుడు రాజ్ కుమార్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లైగిక దాడి, హత్య చేసిన వారిని ఉరి తీయాలి

- ఆదివాసీ తోటి సేవా సంఘం డిమాండ్

నవతెలంగాణ-హాజీపూర్



ఆదివాసీ మహిళను అత్యాచారం చేసి, హత్య చేసిన కామందులను వెంటనే ఉరి తీయాలని ఆదివాసీ తోటి సేవా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్క చిలుకయ్య, కుర్సెంగ వెంకటేష్‌లు డిమాండ్ చేసారు. సోమవారం మంచిర్యాల జిల్లా ఆదివాసీ తోటి సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చిలుకయ్య, వెంకటేష్‌లు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ధనోర గ్రామంలో కుడ్మెత జంగుబాయిని అతి కిరాతకంగ లైగిక దాడి చేసి, హతమార్చి బావిలో పడేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలన్నారు. గిరిజన మహిళలకు మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జంగు బాయి కుమారున్ని ఉన్నత చదువలు చదివిస్తు, భవిష్యత్తులో ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం పిల్లవానికి సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.10లక్షలు ఆర్థిక సహాయం, డబల్ బెడ్రూమ్ ఇవ్వాలన్నారు. శాంతి యుతంగా, అధిక సంఖ్యలో కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కార్యనిర్వహక అధ్యక్షుడు కుడిమేత తిరుపతి, తుడం దెబ్బ జిల్లా మహిళా అధ్యక్షురాలు దుర్వ చిలుకాబాయి, కుమార స్వామి, రాంబాయి, సరాస్వతి, శ్రీదేవి, భవాని, సతీష్, దేవేంద్ర, సంధ్య, జిల్లాలోని 12 ఆదివాసీ గ్రామాల కులస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

కౌటాల : గురుపౌర్ణమి వేడుకలను మండలకేంద్రంలోని రామాలయం ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దయానంద స్వాముల వారి శిష్యుడు గోలి శంకర్ లింగం పాల్గొని గురుపూజ మహోత్సవాన్ని వివరించారు. గురుపూజ, గీతా ప్రవచనములు చేసి అనంతరం వ్యాసాల మార్కేండేయ, సత్యనారాయణ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్మాత కీ.శే వాసాల రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి సంస్మరణ సభ నిర్వహించారు.

బదిలీపై వచ్చిన అధికారికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వచ్చిన ఎస్ఓ టూ జీఎం రఘు కుమార్‌ను జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాను సింగరేణి వ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకురావాలని రఘు కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవింద రావు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

నందిగూడ వద్ద ఉద్రిక్తత



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని నందిగూడ గ్రామం కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా గుర్తు తెలియని వ్యక్తులు చింపి వేశారు. దీనిని ఇతర వర్గానికు చెందిన వారే చింపివేశారని ఆరోపిస్తూ గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి కాగజ్‌నగర్ క్రాస్ రోడ్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. తమ గ్రామం పేరునే మార్చి ఒక మతానికి చెందిన గ్రామంగా బోర్డ్ ఏర్పాటు చేశారని, దానిని తొలగించే వారకు ఊరుకునేది లేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. పోలీసులు అప్పటికప్పుడు ఆ బోర్డ్‌ను తొలగించడంతో గ్రామస్తులు శాంతించి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. గ్రామస్థుల ఆందోళనకు భజరంగ్ దళ్, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కాగా ఆందోళన నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రయివేటు పాఠశాల ఫీజుల్లో పూర్తి రాయితీ ఇవ్వాలి



నవతెలంగాణ-హాజీపూర్

ప్రయివేటు పాఠశాల్లో చదువుకునే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో పూర్తి స్థాయి రాయితీ ఇవ్వాలని టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోల్ల మల్లేష్, గోపతి సత్తయ్య డిమాండ్ చేశారు. ఫీజు రాయితీ విషయమై సోమవారం డీఈఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్ట్ వృత్తిని నమ్ముకుని నిత్యం ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్న జర్నలిస్ట్ లు చాలీ చాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి ఏడాది మాదిరిగా 50 శాతం రాయితీ కాకుండా పూర్తి రాయితీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కమిటీ సభ్యులు చింతకింది మధుసూధన్, జిల్లా ఉపాధ్యక్షుడు అత్తె సాగర్‌లు పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ గర్ల్స్ హాస్టల్ కివ్వాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి

నవతెలంగాణ-హాజీపూర్



పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌కి కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం హాజీపూర్ మండలానికి వచ్చిన ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఇస్తామని గతంలో పలుమార్లు హామీ ఇచ్చారని అనారు. ప్రస్తుత ఎస్సీ గర్ల్స్ హాస్టల్ బంగ్లా వెనుక ఉన్న మహిళా కళాశాల నిర్మాణం పూర్తి చేయలేదని పేర్కొన్నారు. లక్షెట్టిపేట్, దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు శిథిలావస్తకు చేరాయని, వాటికి నూతన భవనలు నిర్మాణం చేయాలన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని, ఇంధన్‌పల్లి రేంజ్ పరిధిలోని, ఇస్లాంపూర్ గ్రామంలో అక్రమంగా ట్రాక్టర్‌లో కలప తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఇందనపల్లి ఎఫ్ఆర్ఓ, ఆఫీస్ ఉద్దీన్ తెలిపారు. పట్టుకున్న ఆరు టేకు కలప దుంగల విలువ రూ.86,000 ఉంటుందని తెలిపారు. నిందితుడు కనక జిత్తు ట్రాక్టర్‌ను పట్టుకొని రేంజ్‌కి తరలించినట్లు ఆయన చెప్పారు. అక్రమంగా కలప తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా కలప తరలించిన నిలువచేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు.

రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని సలుగుపెల్లి, బెజ్జూర్ గ్రామ పంచాయతీలోని రైతువేదికలో సోమవారం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ద్వారా మంజూరైన రైతులకు వంద శాతం సబ్సిడీపై పంపిణీ చేసిన కంది విత్తనాలను ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కుర్సింగ ఓంప్రకాష్ రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక సహకార సంఘం మాజీ చైర్మన్ దోకె వెంకన్న, అందుగులగూడ సర్పంచ్ కుమురం హన్మంతు, పాపన్‌పేట సర్పంచ్ బుజాడి శేఖర్, ఏఈఓలు రవితేజ, మీనా, బీఆర్ఎస్ నాయకులు జావిద్ అలీ, అంజిరి రాజారామ్, చాపిల సత్తన్న, ఏనుక శ్రీహరి, తెలి రాజేశం, రైతులు రమేష్ పాల్గొన్నారు.

ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సంజీవనగర్ కోదండ రామాలయం ఆవరణలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని అధ్యక్షురాలు గజ్జెల జయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు సంబరాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పెంచికల్‌పేట్ ఆర్యవైశ్య మహిళా సంఘం మహిళలు, కాగజ్‌నగర్ ఆర్యవైశ్య సంఘం మహిళలు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి గోరింటాకును తయారు చేసి పెట్టుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి గర్రెపెల్లి స్వాతి, జిల్లా కోశాధికారి లాంతాని నీలిమ, జెడ్పీటీసీ సరిత, కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్ ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ పథకానికి విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నిర్మల్

2023-24 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వి. రాజేశ్వర్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1, 5వ తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు 1వ తరగతిలో 49, 5వ తరగతిలో 52 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ నెల 03 నుండి 15 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు రూ.1,50,000, పట్టణ ప్రాంతాలకు రూ.2లక్షల లోపు ఉండాలని సూచించారు. మిగతా వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

నవతెలంగాణ-బాసర

మండలంలోని బీదరెల్లి గ్రామానికి చెందిన వైశాలి అదృశ్యమైనట్టు ఎస్సై మహేష్ తెలిపారు. జూన్ 22న అత్తగారింటి నుండి వెళ్లిన వైశాలి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో గాలించారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

దళితబంధు పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలి



నవతెలంగాణ - హాజీపూర్

దళితబంధు పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పొచ్చన్న అన్నారు. డీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రాజలింగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పొచ్చన్న మాట్లాడుతూ 2018 శాసనసభ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో జాప్యం చేస్తోందన్నారు. దళితబంధు పథకంలో రాజకీయ జోక్యం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. జీవో నెం.25ను సవరించాలి, గృహలక్ష్మి పథకానికి ప్రతి నియోజకవర్గంలో ప్రతి దళిత కుటుంబానికి వర్తింపజేయాలన్నారు. ఇల్లు నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న వారికి జీవో నెంబర్ 58, 59 ప్రకారం పట్టాలు ఇవ్వాలన్నారు. పేదల ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ భూమి లేకపోతే ప్రైవేట్ భూమిని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మేసు శంకర్, మేడ లచ్చయ్య, పొనగంటి యోసేపు ఆసాది సతీష్, పొనగంటి యాకోబు, రామ సురేష్, రామ మధుకర్, దాసరి జయరాజ్, ఆసాది చైతన్య, ధాముక సాయితేజ, భీమయ్య, బానమ్మ, బక్కమ్మ పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-సిరికొండ

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నిరేష్ అన్నారు. సోమవారం మండలంలోని చిమ్మన్‌గుడి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించగా పక్కా సమాచారంతో చౌహాన్ ధరంసింగ్ కిరాణా దుకాణంలో తనిఖీ చేయగా 8లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.4వేల వరకు ఉంటుందని తెలిపారు. గుడుంబాను విక్రయించవద్దని పలుమార్లు చెప్పినా విన్పించుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో కానిస్టేబుళ్లు ప్రకాష్, అర్జున్ పాల్గొన్నారు.

గిరిజనుల కోసం రూ.53వేల కోట్ల ఖర్చు

- మాటకు కట్టుబడి గిరిజన రిజర్వేషన్, పోడు పట్టాలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్



నవతెలంగాణ-జైపూర్

తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో గిరిజనుల సంక్షేమం కోసం రూ.53వేల కోట్లు ఖర్చు చేశామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి సోమవారం చెన్నూర్‌లో పోడు భూముల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులకు ఇప్పుడు స్వర్ణయుగం కొనసాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి గిరిజనులకు రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 13కు ముందు వరకు సాగు చేస్తున్న వారిని అర్హులుగా గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో గుర్తించిన 666 మంది గిరిజనులకు 1,190 ఎకరాల పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పోడు పట్టాలు పొందిన వారు ఈ ఏడాది వర్షాకాలం సీజన్ నుండి రైతుబంధు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గిరిజనుల అస్తిత్వాన్ని గుర్తించి వారి అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పేరిట విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద గిరిజన విద్యార్థులకు రూ.20లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 500 జనాభా దాటిన 2,471 గిరిజన తండాలను, ఆదివాసీ గూడెలను గ్రామ పంచాయతీలుగా గుర్తించామని, 3,146 గిరిజన గ్రామ పంచాయతీలు రాష్ట్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివాసీ, బంజారాల ఆత్మగౌరవాన్ని సమున్నతంగా చాటే విధంగా రాజధాని నడిబొడ్డున బంజారాహిల్స్‌లో అత్యంత ఖరీదైన స్థలాన్ని కేటాయించి రూ.50 కోట్లతో సంత్ సేవాలాల్ బంజారా భవన్, కుమ్రంభీం ఆదివాసీ భవన్లు నిర్మించనట్లు తెలిపారు. గిరిజన గ్రామాల్లో రూ.248.20 కోట్లతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు రూ.1275.87కోట్లతో 1682 గిరిజన ఆవాసాలకు బీటీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, నియోజకవర్గం పరిధిలో గల వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ భూమి పంచాలి

నవతెలంగాణ-ఉట్నూర్

అర్హులైన పేదలందరికీ భూములను పంచాలని గ్రామీణ పేదల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ముందు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో భూమి లేని ఆదివాసీ గిరిజన, గిరిజనేతరులు పేదలు కడెం కెనాల్ కింద పోరంబోకు భూమిని వ్యవసాయానికి అనుకూలంగా సాగు చేసుకున్నారని, భూమి అడవి ప్రాంతానికి అనుకొని ఉండటం వల్ల అటవీ అధికారులు, పోలీసు అధికారులు కలిసి వందల మందిపై కేసులు పెట్టడం జరిగిందని తెలిపారు. అయినా నేటికి వారికి భూములపై ఎలాంటి హక్కుల లేదని వాపోయారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గిరిజన, దళిత పేదలకు మూడు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి నేటికి నిజమైన బాధితులకు ఈ భూమి ఇవ్వకుండా రాజకీయ ఒత్తిడిలతో అధికార పార్టీ కార్యకర్తలకు వారి అనుకూలమైన వారికి ఈ భూమిని పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం జరిగిన పోడు భూముల సర్వేలో అనేక అక్రమాలు జరిగాయని, భూమి ఉన్న వారికే భూమి ఇచ్చేలా స్థానిక అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. వెంటనే మళ్లీ సర్వే చేయించి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ పీఓ చాహత్‌బాజ్‌పాయిని కలిసి వినతిపత్రం అందించారు. గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నారని తెలుసుకున్న పోలీసులు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీ నాయకులు ఉన్నారు.



కాసిపేట గనిపై రక్షణ అవగాహన సమావేశాలు

నవతెలంగాణ - కాసిపేట

కాసిపేట గనిపై రక్షణ అవగాహన సమావేశాలను సింగరేణి యాజమాన్య ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నా రక్షణ నాదే బాధ్యత నుండి నా రక్షణ నా కుటుంబ బాధ్యతగా మనకు మనమే స్వీయ రక్షణ పొందాలని గని మేనేజర్ అల్లావుద్దీన్ అన్నారు. రక్షణ అవగాహన సమావేశాలు జులై మాసం మొత్తం ఉంటాయన్నారు. రక్షణ ప్రతి క్షణం, ప్రతి నిమిషం ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్క వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే సంస్థ బాగుంటుందని, అవగాహనతో ప్రమాదాలను నివారించవచ్చని రక్షణ అధికారి సునీల్‌కుమార్ అన్నారు. పనిపై అవగాహన కలిగి ఉండడంతో ప్రమాదాలను నివారించుకోవచ్చని, పని చేసే విధానాలు తెలుసుకోవాలని అన్నారు. ఉత్పత్తితో పాటు రక్షణ నియమాలను పాటించి బొగ్గు ఉత్పత్తి తీసుకురావాలని ఉద్యోగులను కోరారు.

ఉద్యోగులకు కౌన్సెలింగ్

గతంలో ప్రమాదాల బారిన పడిన ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించామని మేనేజర్ అల్లావుద్దీన్ తెలిపారు. ప్రమాదానికి గురైన ఉద్యోగికి సలహాలు, సూచనలు అందజేశామని తెలిపారు. ప్రమాదరహిత గనిగా మార్చగల బాధ్యత అందరిపై ఉందన్నారు. కౌన్సెలింగ్ కార్యక్రమంలో రక్షణ అధికారి సునీల్‌కుమార్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషాన్, పిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మీనారాయణ, రక్షణ కమిటీ సభ్యులు బండారు రమేష్, రవి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ సోల్లంకి శ్రీనివాస్, ఒడ్నాల రాజన్న, అండర్ మేనేజర్ సిద్దార్థ, ఓవర్‌మెన్ సత్యనారాయణ, వినయ్, సాయి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6 నుండి సమ్మె చేస్తున్నట్లు సీఐటీయు జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న తెలిపారు. సమ్మెలో భాగంగా సోమవారం పంచాయతీ కార్యాలయంలో సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై అదనపు భారం మోపడం సరికాదన్నారు. ప్రస్తుతం నిత్యావసర ధరలు మండిపోతున్న తరుణంలో వచ్చే జీతాలు కుటుంబపోషణకు సరిపోక కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు చెల్లించి, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించి, ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలని, 60సంవత్సరాలు నిండిన వారికి రూ.5లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా కోశాధికారి ఆనంద్‌రావు, మండల కన్వీనర్ సల్మాన్, కో కన్వీనర్ ఆత్రం సుందర్, నాయకులు వెంకట్రావ్, సోనేరావు, గోవింద్, జంగు, జూగాదిరావు, రమ, కవిత పాల్గొన్నారు.

సాగులో ఉన్న అర్హులైన పేదలందరికి హక్కు పత్రాలు ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాగులో ఉన్న అర్హులైన పేదలందరికి హక్కు పత్రాలు ఇవ్వాలని, హక్కు పత్రాలు రాని దరఖాస్తుదారులకు రాతపూర్వక కారణాలు తెలపాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు, రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు సాగుదారులకు హక్కు పత్రాలు పంపిణీ చేయడాన్ని స్వాగతిస్తూనే, దరఖాస్తు చేసిన ప్రతి ఒక రైతు భూమిని పరిశీలించాలని కోరారు. అధికారిక లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి 4లక్షల14వేల 353 దరఖాస్తులు ప్రభుత్వానికి అందినట్లు అధికారులు చెబుతున్నారని అన్నారు. వాటి ప్రకారం లెక్కిస్తే 12లక్షల 46వేల 846 ఎకరాలకు పట్టాలు ఇవ్వాల్సి ఉందని అంచనా వేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం 1.55 లక్షల మంది సాగుదారులకు 4 లక్షల ఎకరాలపైన మాత్రమే హక్కులు ఇవ్వటానికి ముందుకు రావటం అంటే సగానికి పైగా దరఖాస్తులు తిరస్కరించినట్లే అర్థమువుతున్నదని పేర్కొన్నారు. దీని వల్ల ఎక్కువ మంది రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. సర్వేలో తీసుకోని గ్రామాలు, మండలాలను పరిగణలోకి తీసికొని దరఖాస్తులు మళ్లీ తీసుకోని తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించిన కారణాలు దరఖాస్తుదారులకు గ్రామ సభల ద్వారా తెలియజేయాలన్నారు. తిరస్కరించిన వాటిపై మళ్లీ కొత్త కార్యచరణ ప్రకటించి, అర్హులైన సాగుదారులందరికి హక్కులు కల్పించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం కోరుతుందని అన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులకే కేటాయించాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

ఇటీవల పట్టణ పొలిమేరలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు జరిగిందని, ఈ కేటాయింపుల్లో అర్హులకు కాకుండా అనర్హులకు ఇండ్లు కేటాయించారని ఆరోపించారు. నిరుపేద లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంతోష్ వారికి మద్దతు తెలుపుతూ అధికారులతో మాట్లాడారు. నిరుపేద లబ్ధిదారులకు చెందాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. లక్కీడిప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేసినప్పటికీ లక్కీడిప్‌లో ఎంపికైన వారు సైతం అనర్హులు ఉండటం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, జిల్లా స్థాయి అధికారులతో తిరిగి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిజమైన నిరుపేదలను గుర్తించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు చెందేలా చూడాలని తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ ఆందోళనలో ఇల్లు లేని నిరుపేదలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-మందమర్రి

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం పార్లమెంట్, నియోజక వర్గాల ఇన్‌చార్జీలు, మండల స్థాయి ముఖ్య నాయకుల ప్రమాణ స్వీకార సమావేశం పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షులు సంజయ్ కుమార్, ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు గుల్లపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీ మాత్రమే ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా బాల్క సుమన్‌ను ఓడించే సత్తా కార్మిక బిడ్డ సంజయ్‌కుమార్‌కు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఎండి షరీఫా, రామగుండం ఇన్‌చార్జి పెద్దపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు జక్కుల సమ్మయ్య, టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్, రాష్ట్ర నాయకుడు వాసాల సంపత్, భాస్కరచారి, పట్టణ ఇన్‌చార్జి ముల్కల లక్ష్మీరాజం, ప్రధాన కార్యదర్శి కారం రాజు, గోలేటి సురేందర్, అనంతలక్ష్మి, ఆర్. జయ పాల్గొన్నారు.

ముగిసిన గురు పౌర్ణమి ఉత్సవాలు

నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారి సన్నిధిలో సోమవారం గురుపౌర్ణమి ఉత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున వ్యాస మహర్షి ఆలయంలో వేద వ్యాస మహర్షికి విశేష అభిషేకం నిర్వహించి ఉపనిషత్ పారాయణం, ప్రత్యేక పూజలు చేశారు. యాగ మండపంలో వేద పండితులు అర్చకులు వేద మంత్రోచ్చారణతో పూర్ణాహుతి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఆలయ ఈవో విజయరామారావు పాల్గొన్నారు.

యూరియా, కంది విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి సోమవారం మండల రైతులకు యూరియాతో పాటు కంది విత్తనాలు పంపిణీ చేశారు. ప్రతి రైతుకు యూరియా, కంది విత్తనాలను అందిస్తామని, ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను ఆదుకుంటుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మిలింద్‌కుమార్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 591 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,Represented by its Divisional Manager, MANKAMMATHOTA Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years,R/O. KARIMNAGAR, of above Chit fund ....Disputant

VERSUS

BAIRA RAJASHEKAR & Others
1. BAIRA RAJASHEKAR, S/o. Bhoomraju, Age: 26Yrs, Occ: Own Auto & Maintenance,R/o.H.No: 1-293, Housing Board Colony, Karimnagar.
2. BANDELA NAVEEN KUMAR, S/o. Mallaiah, Age: 38Yrs, Occ: Electrician, SCCL, RK, 5 Inc , R/o.H.No: 50-165, Sripathinagar, Mandamarri, Mancherial.
3. SANDA MADHUSUDAN, S/o. Pochaiah, Age: 38Yrs, Occ: Conductor TSRTC Karimnagar Depot,R/o. H.No:10-4-278/1, Subhashnagar, Karimnagar.
4. GOTTE THARA, W/o. Baira Bhumaraju, Age: 46Yrs, Occ: P.S. Mother, R/o. Housing Board Colony, Karimnagar.
.... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-07-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 546 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,Represented by its Divisional Manager, SURYANAGAR Branch,D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years, R/O. KARIMNAGAR, of above Chit fund ....Disputant

VERSUS

VANAMALA SANTHOSH & Others
2. NALLA BHOOMAIAH S/o. Gangaram Age: 53years, Occ: PG HM Gr-II, GHS Khanapur, R/o. H.no. 5-83, Mohanraopet, Korutla, Jagitial.
3. SREEPADA SREENIVAS S/o. Chakrapani Age: 51years, Occ: SA Maths, GHS Khanapur, R/o. H.no. 6-208,Towars Colony, Khanapur, Nirmal.
6. PATHAKOTI SURESH BABU S/o. Kotaiah Age: 34years, Occ: Sr. Asst., SRSP Camp, Choppadandi, R/o. H.no. 4-100/54/2, Sri Venkateshwara Colony, Alugunur, Karimnagar.
.... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-07-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 572 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,Represented by its Divisional Manager, MANKAMMATHOTA Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years,R/O. KARIMNAGAR, of above Chit fund ....Disputant

VERSUS

KOMALLA KUMAR & Others
1. Komalla Kumar S/o. Rajamouli Age: 29years, Occ: Chicken Center & Sheeps Buying & Selling, R/o. H.no. 6-7/D, Arnakonda, Choppadandi, Karimnagar.
2. Bolli Rajanna S/o. Bapu Age: 36years, Occ: Govt. Employee, General Mazdoor, SRP, R/o. H.no. 2-56, Chakepelli, Bellampally, Adilabad.
.... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-07-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION KARIMNAGAR

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 641 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,Represented by its Divisional Manager, GODAVARIKHANI Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years,R/O. KARIMNAGAR, of above Chit fund ....Disputant

VERSUS

SANTHOSH KUMAR DANDANAYAKULA & Others
1. SANTOSH KUMAR DANDANAYAKULA, S/o. Subash Babu, aged about: 38years, Occ: MedicalRepresentive, R/o.HNO.19-2-29, MARKANDEYA COLONY, GODAVARIKHANI, PEDDAPALLI,TELANGANA.
2. SUBASH BABU DANDANAYAKULA, S/o HANMANTHA RAO D, aged about 65 years, Occ: Lic Agent,R/o. H.NO:19-2-29, MARKANDEYA COLONY, GODAVARI KHANI, PEDDAPALLY, TELANGANA.
3. SRINIVAS ADICHERLA, S/o LAXMAIAH A, Aged About 38 Years, Occ: Badili Worker Rampur Area, R/o. Q,NO:D-1886,RAMESHNAGAR, GODAVARI KHANI, PEDDAPALLY,TELANGANA.
6. KISTAIAH RODDA, S/o POSHAM R, Aged About 47 Years, Occ: General Mazdoor Adriyala Lwp, R/o.H,NO:2-29, ANDUGULAPET, MANDAMARRI, MANCHERIAL,TELANGANA.
.... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-07-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

PUBLIC NOTICE

Under the instructions of my client Smt. Singidi Vijayalaxmi, W/o Singidi Amruth, age 40 yrs occ: Contract Teacher, R/o Adilabad town Dist Adilabad, I hereby issue this Public notice as under:

In this regard link document bearing Regd. Sale Deed Doc. No. 2454/2001, dt. 19-11-2001 has been lost by my client purchaser Smt. Singidi Vijayalaxmi, W/o Singidi Amruth. And declared the said document is lost. That the said document is belongs to House No; 184 EWS (m.c No; 1-1-45/c/184) situated at Adilabad.

In this regard notice is hereby issued for public at large, who ever having any right in the said property or got the property by way of pledge, mortgage are hereby given for reply within 7 days, otherwise my client will proceed for purchase the said land as per law in force.

Sd/-
Smt. Singidi Vijayalaxmi
Sd/-
B. Prem Singh, Advocate & Notary, Ravindra Nagar, Adilabad -504001
Cell No: 9441023162

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 687 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,Represented by its Divisional Manager, PEDDAPALLY Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years,R/O. KARIMNAGAR, of above Chit fund ....Disputant

VERSUS

TUDI SAMPATH & Others
2. MALLAIAH VEERAVENI, S/o KANAKAIAH V, aged about 56 years, Occ: General Mazdoor O/o R K N T Inc Srirampur Area,R/o. QNO.T-680, KRISHNA COLONY, SRIRAMPUR, Mancherial,TELANGANA.
3. MAHESH POOSALA, S/o SARAIAH P, aged about 31 years, Occ: Badili Worker O/o Gdk 2 Inc Rgm,R/o. HNO.1-70,MADAKA, ODELA, KARIMNAGAR,TELANGANA.
5. PEDDA RAJAIAH THODI, S/o ANKAIAH P, Aged About 71 Years, Occ: Formar, R/o. HNO.3-469,MADAKA, ODELA,KARIMNAGAR,TELANGANA.
.... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-07-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 659 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,Represented by its Divisional Manager, GODAVARIKHANI-2 Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years,R/O. KARIMNAGAR, of above Chit fund ....Disputant

VERSUS

NAGULA RAMARAO & Others
3. PERKA HANUMANTHU S/o. MAHANKALI, Age: 57yrs, Occ: TRAMMAR RK 5INCLINE BPA SRIRAMPUR, R/o. H .NO:21-19 A ZONE GANDHINAGAR RAMAKRISHNAPUR,MANCHERIAL.
7. ENUGULA SHANKAR,S/O: BALAIAH, Age:48yrs,Occ: General Mazdoor, BPA SRIRAMPUR AREA SRP-3,R/o:H.NO:7-1/4 MANDAMARRI,MANCHERIAL.
.... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-07-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 680 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,Represented by its Divisional Manager, PEDDAPALLY Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years,R/O. KARIMNAGAR, of above Chit fund ....Disputant

VERSUS

MANTHENA SATHISH & Others
1. MANTHENA SATHISH, S/o. Lingaiah, Age: 32Yrs, Occ: Sri Vamshi Chicken Center, Market Area,Bellampalli, R/o. H.No: 14-156/1, Bellampalli Basthi, Bellampalli, Dist: Mancherial.
5. SAMALLA PARAMESHWAR, S/o. Jaihind Rao, Age: 36Yrs, Occ: Badli Worker, Shanthikhani Incline, Mandamarri Area, R/o. H.No: 8-26, Ram Nagar, Naspur Colony, Mdl: Naspur, Dist: Mancherial ...... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-07-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 606 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,Represented by its Divisional Manager, MANKAMMATHOTA Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years,R/O. KARIMNAGAR, of above Chit fund ....Disputant

VERSUS

GURRALA RAVINDER & Others
7. ATHRAM PEDDI RAJAIAH S/o. Bheemaiah, Age: 59Yrs, Occ: Cook, Govt B C Boys Hostel,Nagunoor, R/o. H.no. 6-8, Thimmapur, Adilabad.
.... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-07-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE : AT KARIMNAGAR
IA NO. 1592 OF 2014
IN
O.S. NO 379 OF 2010

Between:-
KAPIL CHIT FUNDS PRIVATE LIMITED ...Plaintiff.
A N D
BOINI MUJJAIAH& Others ... Defendants.

TO,
D3.Boini Swamy, s/o. Nagaiah age: 48years, occ: o/o.c coal filler iK 1A incline, srirampur, r/o. h.no. 1-518/1, ACC andra colony, manchirial, dist. Adilabad.

Where as the plaintiff file the above Suit for the recovery of the money against you and others and where as the above Suit is posted to 25-07-2023 for your appearance

Take notice that in default of your appearance in person or through Advocate on the said date at 10-30 A.M. the matter will be deter mind setting you ex party

// BY ORDER OF THE COURT //

Sri. K.C.MURTHY ADVOCATE, KARIMNAGAR, Counsel for the Plaintiff.

జడ్జిని కలిసిన సింగరేణి అధికారులు

నవతెలంగాణ-నస్పూర్



మంచిర్యాల జిల్లాకు బదిలీపై వచ్చిన నూతన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావును శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, కార్పొరేట్ జనరల్ మేనేజర్ సేఫ్టీ గురువయ్య, బెల్లంపల్లి రీజియస్ సేఫ్టీ జనరల్ మేనేజర్ హరి నారాయణ గుప్తా సోమవారం సిసిసి సింగరేణి గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు సింగరేణి గెస్ట్ హౌస్‌లో మొక్కను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఉదయ్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి అజయ్ ఉల్లం, చెన్నూర్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి సంపత్, టీబీజీకేఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, ఎస్‌ఓ టూ జీఎం రఘు కుమార్, ఎస్‌ఆర్పి గ్రూప్ గనుల ఏజెంట్ గోపాల్ సింగ్, గెస్ట్ హౌస్ ఇన్‌ఛార్జి దేవేందర్‌రెడ్డి, లా ఆఫీసర్ ప్రబంధిత పాల్గొన్నారు.

గురువును సత్కరించిన సీనియర్ సిటిజన్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

గురు పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.వెంకటయ్యను విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జిల్లా అధ్యక్షకార్యదర్శులు పూర్ణచందర్ రావు, నారాయణ, ఏఎస్ఆర్ మూర్తి, మురళిధర్ రావు, కలికోట రమణయ్య, యెల్లాగౌడ్, వాహబ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు జయదేవ్, శివప్రసాద్, నర్సింగ్‌రావు, సాంబశివు, బావండ్లపల్లి నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్కే-1ఏ గనిని సందర్శించిన నూతన ఏజెంట్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్కే-1ఏ గని నూతన ఏజెంట్‌గా నియమితులయిన గోవిందరావు సోమవారం ఆయన గనిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఏఐటీయూసీ నాయకులు శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం ఏఐటీయూసీ నాయకులు జిల్లా అధ్యక్షులు అక్బర్ అలీ మాట్లాడుతూ ఆర్కే-1ఏ గనిలో 5 ఐదు సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని, గనిని నడిపించాలని కోరారు. గని నడవడం ద్వారా రామకృష్ణాపూర్ ప్రజలకు మేలు చేసినవారు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని పిట్ కార్యదర్శి సురమల్ల వినయ్ కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఇప్పకాయల లింగయ్య పాల్గొన్నారు.

కోవిడ్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో కోవిడ్ కారణంగా మృతిచెందిన ప్రయివేటు సెక్యూరిటీ గార్డు(కాంట్రాక్టు వర్కర్) సామల రామ్మూర్తి కుటుంబీకులకు బెల్లంపల్లి ఏరియా జీఎం జి.దేవేందర్ సోమవారం రూ.15 లక్షలు చెక్కును అతని భార్య నర్మదకు ఆర్థిక సాయంగా అందజేశారు. సామల రామ్మూర్తి బెల్లంపల్లి ఏరియాలో ప్రయివేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కోవిడ్ కారణంగా 2021లో మృతిచెందాడు. దీంతో సింగరేణి సంస్థ కాంట్రాక్టు వర్కర్లకు కోవిడ్ ఎక్స్‌గ్రేషియా వర్తింప చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. రూ.15 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేసుకొని పిల్లల చదువుల కోసం పొదుపుగా వినియోగించుకోవాలని జీఎం వారికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం మస్తూరి నరేందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్, డీజీఎం(ఎఫ్అండ్ఎ) రామారావు, పర్సనల్ మేనేజర్ ఐ.లక్ష్మణ్‌రావు, పిట్ కార్యదర్శి గడ్డం రవీందర్ పాల్గొన్నారు.

చెన్నూర్‌లో గుడిసెలు వేసుకున్న పేదల ఇండ్లకు పట్టాలివ్వాలి

- అక్రమ పట్టాలను వెంటనే రద్దు చేసి, నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
- ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-నస్పూర్

చెన్నూర్‌లో గుడిసెలు వేసుకున్న పేదల ఇండ్లకు పట్టాలివ్వాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టరేట్ ముందు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు ఆశయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. పేదలకు ఇస్తామన్న మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూంలు, ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు నేటికి ఇవ్వకపోవడం చాలా దారుణమని పేర్కొన్నారు. ఎక్కడ ప్రభుత్వ భూమి కనబడితే అక్కడ అధికార పార్టీ నాయకులు కబ్జాలు చేస్తూ, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, కానీ పేదోడికి గజం భూమి ఇవ్వడానికి కూడా ప్రభుత్వానికి దొరకడం లేదా? అని ప్రశ్నించారు. చెన్నూరులోని బావురావుపేట శివారు సర్వే నెంబర్ 8 లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు భూ కబ్జాదారులు అక్రమ పట్టాలు చేసుకున్నారన్నారు. వాటిని వెంటనే రద్దు చేసి గుడిసెలు వేసుకున్న పేదల ఇండ్లకు ఇంటి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. రవి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకె రవి మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన ప్రకారం గృహలక్ష్మి పథకానికి మూడు లక్షలకు బదులు ఐదు లక్షలు ఇచ్చి గుడిసె వేసుకున్న పేదలకు వర్తింపజేయాలన్నారు. జిల్లాలో ఇల్లు లేని నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.10లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు వెంటనే చెల్లించాలన్నారు. కోటపల్లి, చెన్నూరు, వేమనపల్లి, భీమారం, జైపూర్, కాళేశ్వరం బ్యాక్ వాటర్ ద్వారా నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ చెన్నూరులో గుడిసెలు వేసుకున్న పేదలపై భూకబ్జాదారులు రాత్రి, పగలు నిత్యం దాడులు చేస్తూ భయపెడుతున్నారన్నారు. దాడులు చేస్తున్న భూకబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకొని, చట్టపరంగా కేసులు నమోదు చేసి, గుడిసెలు వేసుకున్న పేదలకు రక్షణ కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనగారపు అశోక్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి బోడేంకి చందు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దాగం శ్రీకాంత్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే. ప్రేమ్‌కుమార్, వృత్తిదారుల సంఘం సంఘం జిల్లా కార్యదర్శి పైరాల రాములు, సిపిఐ(ఎం) సర్పంచ్ గోమాస అశోక్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు రమేష్, భూదేవి, సీఐటీయు నాయకులు రవి, తిరుపతి, అనిల్, కరీమా, ఎండి. అవేజ్, చెన్నూరు భూ పోరాట కమిటీ నాయకులు శ్రీనివాస్, నగేష్, రేణుక, మణి, సంధ్య, సమ్మక్క,శంకర్ పాల్గొన్నారు.



భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్‌లు డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించాలంటూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు ద్వారా అందాల్సిన నిధులను లేబర్ అధికారులు జాప్యం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న వెల్ఫేర్ బోర్డుల నిధుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఏసీఎల్ ఆఫీసు జిల్లా కేంద్రానికి తీసుకురావడానికి కలెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. అర్హులైన భవననిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నిధుల నుండి పెండ్లి కానుక, ప్రసూతి కానుక, సాధారణ, యాక్సిడెంట్ మరణాలకు వెంటనే నిధులను



విడుదల చేసి పెండింగ్ క్లెయిమ్స్‌లను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కమలాకర్, మండల ఉపాధ్యక్షులు రామచందర్, కోశాధికారి సదయ్య, ప్రధాన కార్యదర్శి దూడల అశోక్ పాల్గొన్నారు.

ఆర్కే-న్యూటెక్ గనిపై అవయవ దానంపై అవగాహన



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గనిపై సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'అవయవ దానం'పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న సదాశయ ఫౌండేషన్ సలహాదారు నూక రమేష్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ఆర్కే-న్యూటెక్ గని ఎస్‌ఓఎం ఇ.స్వామిరాజుతో కలసి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం, నేత్ర దానం, అవయవ దానాల్లో సింగరేణీయులు ముందుంటున్నారని తెలిపారు. చాలా మందిలో అవయవ దానంపై అపోహలు ఉన్నాయని వాటిని వీడాలన్నారు. మరణించిన తర్వాత ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నేత్ర దానం, అవయవ దానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పేర్కొన్నారు. సదాశయ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు సుమారు 800 మంది నేత్ర దానం చేయగా వాటితో 1600 మందికి చూపు కల్పించినట్లు వివరించారు. ఇదే స్ఫూర్తితో మిగితా ఉద్యోగులు ముందుకు రావాలని కోరారు. అనంతరం ఆర్కే-న్యూటెక్ గనిలో మెకానిల్ ఫోర్మెన్‌గా విధులు నిర్వహిస్తున్న కె.వెంకటేశం తన పుట్టిన రోజు సందర్భంగా అవయవ దానం చేసేందుకు ముందుకు రాగా ఆయన్ని గని ఎస్‌ఓఎం ఇ.స్వామిరాజు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అవయవ దానానికి ముందుకొచ్చిన ఎస్టీఎల్ ఆపరేటర్ బుద్ది ప్రసాద్‌కు వారు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టె రమేష్, సదాశయ ఫౌండేషన్ గోదావరిఖని, మంచిర్యాల బాధ్యులు వాసు, రామిరెడ్డి, రాజమౌళి, సంక్షేమాధికారి పాల్ సజన్, టీబీజీకేఎస్ ప్రతినిధి బుస్స రమేష్, పిట్ ఇంజినీర్ రాజగోపాలచారి, వెంటిలేషన్ అధికారి శంకర్ పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు పాటించి సంస్థకు పేరు తేవాలి

నవతెలంగాణ-నస్పూర్

రక్షణ సూత్రాలు పాటిస్తూ సింగరేణి సంస్థకు మంచి గుర్తింపు తీసుకురావాలని కార్పొరేట్ జనరల్ మేనేజర్(సేఫ్టీ) గురువయ్య అన్నారు. సోమవారం ఎస్‌ఆర్పీ 3,3ఏ గనిలో కార్పొరేట్ (సేఫ్టీ) జీఎం గురువయ్య, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, బెల్లంపల్లి రీజియన్ (సేఫ్టీ) మేనేజర్ కేహెచ్ఎన్ గుప్తా, ఆర్కే-6 గనిలో రక్షణాధికారి శ్రీధర్ రావు, గని మేనేజర్ తిరుపతి, ఆర్కే న్యూ టేక్ గనిలో ఎస్‌ఓఎం స్వామిరాజు, శ్రీరాంపూర్ ఏరియా ఉపరితల గనిలో కాలరీ మేనేజర్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నా భద్రత నా బాధ్యత, నా భద్రతే నా కుటుంబ భద్రత అను అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. పని స్థలాల్లో రక్షణకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యంతో కాకుండా నైపుణ్యంతో విధులు నిర్వహించాలని తెలిపారు. విధుల్లో సమస్యలు తలెత్తితే ఆ విషయాన్ని సూపర్‌వైజర్ అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రమాద రహిత సింగరేణిగా ఉద్యోగులందరూ కృషి చేయాలని తెలిపారు. ఇంటి నుండి బయటికి బయలు దేరె ముందు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి రావలని, మళ్లీ తిరిగి ఇంటికి వెళ్ళేవరకు ప్రతి క్షణం వ్యక్తిగత భద్రత పాటిస్తూ, అదేవిధంగా పని స్థలాలలో వ్యక్తిగత రక్షణ పరికరాలను ఎల్లపుడూ ధరించి, పని స్థలాలలో ఎల్లావేళల అప్రమత్తతో ఉండాలని అవగాహనా కల్పించారు. అనంతరం కార్పొరేట్ జనరల్ మేనేజర్(సేఫ్టీ) గురవయ్య జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేయించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.